భూభారతి చట్టంతో సమస్యలు పరిష్కారం : కలెక్టర్

మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్

బూర్గంపహాడ్, ఏప్రిల్ 29: భూభారతి చట్టంతో భూమి సమస్యలు పరిష్కారమవుతాయని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. మంగళవారం బూర్గంపహాడ్‌లోని రైతువేదికలో ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో భూ భారతి చట్టంపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ రైతులనుద్దేశించి మాట్లాడారు. రైతుల ఇళ్ల వద్దకే రెవెన్యూ అధికారులను పంపించి సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామన్నారు. భూ చట్టానికి సంబంధించి విధి, విధానాలు, వాటి తీరుతెన్నులను రైతులకు అవగాహన కల్పించారు. ఈ సదస్సులో ట్రైనీ కలెక్టర్ సౌరభ్‌శర్మ, ఆర్డీవో దామోదర్‌రావు, తహసీల్దార్ ముజాహిద్, ఎంపీడీవో జమలారెడ్డి, ఏడీఈ తాతారావు, మండల ప్రత్యేకాధికారి రవీందర్, ఏవో శంకర్, డీటీ రాంనరేష్ పాల్గొన్నారు.

భద్రాచలం, ఏప్రిల్ 29: భూభారతి చట్టంతో రైతుల భూమి హక్కులు భద్రంగా ఉంటాయని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. మంగళవారం భద్రాచలంలో టీవీ స్టేషన్ రైతువేదిక వద్ద ఏర్పాటు చేసిన భూభారతి రెవెన్యూ అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, ఐటీడీఏ పీవో రాహుల్‌తో కలిసి కలెక్టర్ మాట్లాడుతూ.. భూ సమస్యలు త్వరితగతిన పరిష్కారమవుతాయని, రైతుల మేలు కోసం ప్రజాపాలనలో చారిత్రక మార్పుతో ఈ చట్టం డిజిటలైజేషన్ చేసి రూపొందించడం జరిగిందన్నారు. భద్రాచలం మార్కెట్ కమిటీ చైర్మన్ తెల్లం సీతమ్మ, తహసీల్దార్ శ్రీనివాస్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

'అందుబాటులోకి పూర్తి సేవలు'

అశ్వారావుపేట, ఏప్రిల్ 29 : కొత్తగా ఏర్పడిన అశ్వారావుపేట మున్సిపాలిటీ నుంచి పూర్తి సేవలు అందుబాటులోకి వచ్చాయని కమిషనర్ కె.సుజాత తెలిపారు. భవన నిర్మాణ అనుమతులు, జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు, ఇంటి యజమానుల పేరు మార్పు వంటి సేవలు ప్రారంభించినట్లు ఆమె చెప్పారు. స్థానిక కార్యాలయంలో మంగళవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. కొన్ని సాంకేతిక కారణాల వల్ల మున్సిపల్ సేవలు అందించటంలో సమస్య నెలకొందని, ఇప్పుడు మున్సిపల్ హోదాలోనే ఆన్‌లైన్ ద్వారా అన్ని సేవలు అందిస్తున్నట్లు వివరించారు.

మండలంలో ఎమ్మెల్యే జారే పర్యటన

ములకలపల్లి, ఏప్రిల్ 29 : మండలంలో అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ మంగళవారం విస్తృతంగా పర్యటించారు. ఇందిరమ్మ చెరువు బాట కార్యక్రమం ద్వారా పాత గంగారం, పూసుకుంట గ్రామాల్లో పలు చెరువులు, పంట కాలువల మరమ్మతులకు శంకుస్థాపనలు చేశారు. ములకలపల్లి రైతువేదికలో సీఎం సహాయనిధి చెక్కులు 22 మందికి అందించారు. ఆయన వెంట తాండ్ర ప్రభాకర్, మాజీ జెడ్పీటీసీ బత్తుల అంజి, కారం సుధీర్, పాలకుర్తి సుమిత్ పాల్గొన్నారు.,

అంగన్‌వాడీ టీచర్ల ముందస్తు అరెస్ట్

ఇల్లెందులో అరెస్ట్ అయిన అంగన్‌వాడీ టీచర్లు, సీఐటీయూ నాయకులు

ఇల్లెందు, ఏప్రిల్ 29 : హైదరాబాద్‌లో మంత్రి సీతక్క క్యాంపు కార్యాలయాన్ని ముట్టడిస్తారనే సమాచారం మేరకు ఇల్లెందు పోలీసులు పట్టణంలోని అంగన్‌వాడీ టీచర్లు, సీఐటీయూ నాయకులను మంగళవారం ముందస్తుగా అరెస్టు చేశారు. పోలీసులు ఉదయం 7 గంటలకే ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యదర్శి కల్లేపల్లి మరియా, ప్రాజెక్టు నాయకులు సరస్వతి, కె. అరుణ తదితరులను అదుపులోకి తీసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఇళ్లలో ఉన్నవారిని పోలీసులు అక్రమంగా అరెస్టు చేయడాన్ని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అబ్దుల్ నబి తీవ్రంగా ఖండించారు.

అటవీ ఉత్పత్తులను డీఆర్ డిపోలో అమ్ముకోవాలి

మాట్లాడుతున్న జీసీసీ మేనేజర్ నరసింహం

గుండాల, ఏప్రిల్ 29: అటవీ ఉత్పత్తులను జీసీసీ దగ్గరలోని డీఆర్ డిపోలో అమ్ముకునే సౌకర్యం కల్పించినట్లు జీసీసీ మేనేజర్ నరసింహ తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలోని జీసీసీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. అటవీ ఉత్పత్తులను మధ్య దళారులకు అమ్మి మోసపోకూడదని సూచించారు. అటవీ ఉత్పత్తుల సేకరణదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

టేకులపల్లి, ఏప్రిల్ 29 : అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను టేకులపల్లి పోలీసులు పట్టుకున్నారు. టేకులపల్లి ఎస్సై రాజేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. బొమ్మనపల్లి ముర్రేడు నుంచి మంగ్యతండా గ్రామానికి చెందిన బానోత్ నగేష్ ట్రాక్టర్‌లో ఇసుక తరలిస్తుండగా తావుర్యతండా వద్ద పట్టుకొని కేసు నమోదు చేసి, ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్లు తెలిపారు.

విద్యార్థుల అపూర్వ సమ్మేళనం

ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

రామవరం, ఏప్రిల్ 29 : వారం దరూ ఆయా వృత్తుల్లో స్థిరపడ్డారు. కానీ అవన్నీ మర్చిపోయి పదిహేను సంవత్సరాల క్రితం వారు కూర్చున్న క్లాసులో కూర్చొని నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ మళ్లీ విద్యార్థులుగా మారిన సంఘటన రుద్రంపూర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో చోటుచేసుకుంది. 2007-2010 సంవత్సరంలో సివిల్ డిప్లొమా బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం జరిగింది. 15 ఏళ్ల క్రితం కలిసి చదువుకున్న వారంతా పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో కలుసుకున్నారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. యోగ క్షేమాలను అడిగి తెలుసుకుఅన్నురు., అప్పటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ప్రస్తుత ప్రిన్సిపాల్, మాజీ సివిల్ లెక్చరర్ వెంకటేశ్వర్లు, వరంగల్ పాలిటెక్నిక్ కాలేజీ లెక్చరర్ న్యూరీ, ఫిజిక్స్ లెక్చరర్ వినోద్, డ్రాయింగ్ లెక్చరర్ సుబ్రహ్మణ్యం, విశ్రాంత ఉద్యోగి పాషాలను సన్మానించారు. మంతెన బాలకృష్ణ, బజార్, కీర్తి, స్వర్ణలత, సిద్దార్థ రెడ్డి, చైతన్య, షబ్బీర్ పాల్గొన్నారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
నమస్తే తెలంగాణ దినపత్రికలో
చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో
ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073
నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల
ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616

నియోజకవర్గంలో ఎమ్మెల్యే ఉన్నాడనుకున్నారా? లేకుంటే చచ్చాడనుకున్నారా??

అధికారులపై అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ ఆగ్రహం

అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఎమ్మెల్యే జారే చేయిపట్టుకొని తీసుకెళ్తున్న మంత్రి తుమ్మల

దమ్మపేట, ఏప్రిల్ 29: 'నియోజకవర్గంలో ఎమ్మెల్యే ఉన్నాడనుకున్నారా? లేకుంటే చచ్చాడనుకున్నారా?' అంటూ అశ్వారావుపేట ఎమ్మెలే జారే ఆదినారాయణ.. అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. 'ఎమ్మెల్యే జారే అంటే పిచ్చోడిలా కన్పిస్తున్నాడా? నా నియోజకవర్గంలో నాకు తెలియకుండానే శంకుస్థాపన ఏర్పాట్లు చేస్తారా?' అంటూ మండిపడ్డారు. 'నా ఆత్మాభిమానం దెబ్బతిన్నది. నేను ఇక్కడ ఉండలేను. వెళ్లిపోతున్నా..' అంటూ అలకబూనారు. చివరికి పక్కనే ఉన్న మంత్రి తుమ్మల సముదాయించినా ఎమ్మెల్యే అలక వీడలేదు. పలు అభివృద్ధి కార్యక్రమాల శంకుస్థాపనలు, ప్రారంభాల సందర్భంగా దమ్మపేట మండలంలో మంగళవారం జరిగిన ఈ ఘటన స్థానికంగా చర్చనీయాంశమైంది. తొలుత పూసుకుంట గ్రామంలోని బీటీ రోడ్ల శిలాఫలకాల శంకుస్థాపన వద్ద ఈ ఘటన జరిగింది. ఎమ్మెల్యే అలకబూనడంతో మంత్రి తుమ్మల ఆ బీటీ రోడ్ల శిలాఫలకాల శంకుస్థాపన కార్యక్రమాన్ని ఆపివేశారు. ఎమ్మెల్యే చేయిపట్టుకొని తన తన వాహనంలో తీసుకెళ్లారు. మిగతా పర్యటనలన్నీ ముగిసిన తర్వాత ఆఖరుకు మళ్లీ పూసుకుంట చేరుకొని రూ.15 కోట్లతో చేపట్టిన బీటీ రోడ్లు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు.

బీఆర్ఎస్ సభ విజయవంతంపై ధన్యవాదాలు

విలేకర్లతో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

పినపాక, ఏప్రిల్ 26: వరంగల్‌లో జరిగిన బీఆర్ఎస్ రజతోత్సవ సభకు పినపాక నుంచి హాజరైన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులందరికి ధన్యవాదాలు తెలుపుతున్నట్లు మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు పగడాల సతీష్ రెడ్డి పేర్కొన్నారు. ఆయన మంగళవారం ఈబయ్యారం అడ్డరోడ్‌లోని బీఆర్ఎస్ కార్యాలయంలో స్థానిక బీఆర్ఎస్ నాయకులతో కలిసి మాట్లాడారు. పినపాక మండలం నుండి బీఆర్ఎస్ పాతికేళ్ల పండుగకు 76 కార్లు, 9 టాటా మ్యాజిక్‌లలో నాయకులు, కార్యకర్తలు తరలి వెళ్లి రజతోత్సవ గ్రాండ్ సక్సెస్‌లో పాలుపంచుకున్నారని అన్నారు. కార్యక్రమంలో గుమ్మడి గాంధీ, వర్మ, భవాని శంకర్, భద్రయ్య, వాసు బాబు, బత్తుల వెంకటరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, సత్తి బాబు, మహేష్, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

మణుగూరు టౌన్, ఏప్రిల్ 29: వరంగల్‌లో జరిగిన బీఆర్ఎస్ ఆవిర్భావ రజతోత్సవ భారీ బహిరంగ సభ విజయవంతానికి కృషి చేసిన నాయకులు, కార్యకర్తలకు బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు మంగళవారం ధన్యవాదాలు తెలిపారు. జిల్లా నుంచి ఊహించిన దాని కంటే ఎక్కువ మంది నాయకులు, కార్యకర్తలు బస్సులతో పాటు ప్రైవేట్ వాహనాలు, బైక్‌లపై ఎవరికి వారే బహిరంగ సభకు చేరుకోవడం ఆశ్చర్యాన్ని కలిగించిందన్నారు. రజతోత్సవ వేళ వరంగల్ గడ్డపై లక్షలాది మందిగా, ఒక చీమల దండులా తరలి ప్రత్యర్థుల వెన్నులో వణుకు పుట్టించిన అందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ఎదురెదురుగా రెండు కార్లు ఢీ

వ్యక్తి మృతి, ఆరుగురికి తీవ్రగాయాలు

జూలూరుపాడు, ఏప్రిల్ 29 : ఎదురెదురుగా రెండు కార్లు ఢీకొన్న దుర్ఘటనలో ఓ వ్యక్తి మృతిచెందగా ఆరుగురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ప్రమాదం జూలూరుపాడు మండలం వినోభానగర్ గ్రామ సమీపంలోని ప్రధాన రహదారిపై మంగళవారం చోటుచేసుకుంది. క్షతగాత్రుల్లో సౌత్ కొరియాకు చెందిన ముగ్గురు టూరిస్టులు ఉన్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని రామానుజుగూడెం గ్రామానికి చెందిన వానపాకుల సాంబశివరావు(25) తన భార్య శ్రీలత, మరదలు సంధ్యతో కలిసి కారులో హైదరాబాద్ వెళ్తున్నారు. ఈ క్రమంలో ఉత్తర కొరియాకు చెందిన ముగ్గురు టూరిస్టులు భద్రాచలంలోని రాములోరిని సందర్శించుకొనేందుకు హైదరాబాద్ నుంచి కారులో వస్తుండగా ఎదురెదురుగా ఢీకొన్నాయి. రెండు కార్లు నుజ్జునుజ్జుకావడంతో సాంబశివరావు కాళ్లు విరిగాయి.. శ్రీలత, సంధ్యకు తీవ్రగాయాలయ్యాయి. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సాంబశివరావు మృతిచెందాడు. టూరిస్టులు స్కిమ్, షిన్, కిమ్ కారు డ్రైవర్ దర్శన్‌కు తీవ్రగాయాలు కావడంతో 108లో కొత్తగూడెం ప్రభుత్వాసుపత్రికి, అక్కడి నుంచి మెరుగైన వైద్యంకోసం ఖమ్మం తరలించారు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఏరియాలో స్ట్రక్చర్ కమిటీ సమావేశం

మాట్లాడుతున్న జీఎం శాలెంరాజు

రామవరం, ఏప్రిల్ 29 : ఏరియా జీఎం కార్యాలయంలో మంగళవారం గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలతో స్ట్రక్చర్ కమిటీ సమావేశాలు వేరువేరుగా నిర్వహించారు. ఏరియా జీఎం శాలెంరాజు పాల్గొని గుర్తింపు, ప్రాతినిధ్య సంఘం కమిటీ సభ్యులు అందజేసిన డిమాండ్లను ఈ సందర్భంగా చర్చించారు. డిమాండ్ల అమలుకు సాధ్యాసాధ్యాలను పరిశీలించి ఏరియా పరిధిలో పరిష్కరించదగిన డిమాండ్లను వీలైనంత తొందరగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. ఏఐటీయూసీ నుంచి మల్లికార్జున్‌రావు, గట్టయ్య, సముద్రాల సుధాకర్, ఐఎన్టీయూసీ నుంచి ఎండీ రజాక్, నాగరాజు, సమ్మయ్య, యాజమాన్య ప్రతినిధులు ఎస్‌వోటు జీఎం కోటిరెడ్డి, ఏజీఎం సివిల్ రామకృష్ణ, రవీందర్, డీజీఎం శివకేశవరావు, పీవో రమేష్ పాల్గొన్నారు.

యువకుడి మృతదేహం లభ్యం

అశ్వారావుపేట రూరల్, ఏప్రిల్ 29 : మండల పరిధిలోని వినాయకపురం గ్రామానికి చెందిన ఉప్పల సాయివర్మ(25) మృతదేహం ఏలూరు జిల్లా కుక్కునూరు మండలం వింజరం గ్రామ సమీపంలోని గోదావరిలో మంగళవారం లభ్యమైంది. ఆదివారం వినాయకపురంలోని తన ఇంటి నుంచి సాయివర్మ ద్విచక్రవాహంపై వెళ్లాడు. సోమవారం తల్లిదండ్రులు ఉప్పల మహేశ్వరావు, శ్రీదేవి, స్నేహితులు ఫోన్ చేస్తుండగా వింజరం గోదావరి వద్ద గొర్రెలకాపలాదారులు ఫోన్‌ను ఎత్తి చెప్పలు, ఫోన్ ఇక్కడ గోదావరి ఒడ్డున ఉన్నాయని సమాచారం ఇవ్వడంతో గ్రామస్తులు, కుటుంబసభ్యులు తరలివెళ్లారు. గోదావరిలో గాలించగా మృత్యుదేహం లభ్యమైంది. ప్రేమలో విఫలమై ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కుక్కునూరు పోలీస్‌స్టేషన్‌లో కుటుంబసభ్యులు ఫిర్యాదు చేశారు. మృతదేహాన్ని జంగారెడ్డిగూడెం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

అధికారుల తనిఖీలు

ఇల్లెందురూరల్, ఏప్రిల్ 29 : ఇల్లెందు మండలంలో వ్యవసాయశాఖ, విజిలెన్స్ అధికారి శ్రీనివాస్ బృందం తనిఖీలు చేపట్టారు. వ్యవసాయశాఖ కార్యాలయాల్లో పలు రికార్డులను క్షుణంగా పరిశీలించి అధికారులతో మాట్లాడుతూ పత్తి కొనుగోలుకు సంబంధించిన 148 కూపన్ల వివరాలను అడిగి తెలుసుకున్నారు. కొమరారం గ్రామంలో రైతులతో మాట్లాడారు. విత్తనాలకు సంబంధించిన రికార్డులు లేకుండా విక్రయించడం నేరమన్నారు.

టీపీహెచ్‌డీఏ అసోసియేషన్ ప్రారంభం

భద్రాద్రి కొత్తగూడెం, ఏప్రిల్ 29 (నమస్తే తెలంగాణ) : భద్రాద్రి కొత్తగూడెంలో తెలంగాణ పబ్లిక్ హెల్త్ డాక్టర్స్ అసోసియేషన్‌ను కలెక్టర్ జితేశ్ వి పాటిల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా టీపీహెచ్‌డీఏ డెయిరీని ప్రారంభించి దాని ప్రాముఖ్యతను కలెక్టర్ నొక్కిచెప్పారు. ఇది వైద్యులకు రోజువారి ప్రజారోగ్య సేవలో విలువైన సాధనంగా ఉపయోగపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డాక్టర్ భాస్కర్ నాయక్, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ ఎస్.జయలక్ష్మి, కొత్తగూడెం డాక్టర్ మధువరన్, టీపీహెచ్‌డీఏ అధ్యక్షుడు డాక్టర్ బాలాజీ, డాక్టర్లు సపందన, పుల్లారెడ్డి, తేజశ్రీ, సాయి కల్యాణ్ పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన ట్రైనీ కలెక్టర్

భద్రాద్రి కొత్తగూడెం, ఏప్రిల్ 29 (నమస్తే తెలంగాణ) : జిల్లాకు కొత్తగా నియమించబడిన ట్రైనీ కలెక్టర్ సౌరభ్ శర్మ మంగళవారం కలెక్టర్ జితేశ్ వి పాటిల్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పూల మొక్కను అందజేశారు.

భద్రాద్రి రామయ్యకు నిత్యకల్యాణం

భద్రాచలం, ఏప్రిల్ 29: భద్రాచలం సీతారామచంద్రస్వామి దేవస్థానంలో మంగళవారం సీతారాముల స్వామివారికి అర్చకులు నిత్యకల్యాణం నిర్వహించారు. తెల్లవారుజామున ఆలయ తలుపులు తెరిచి సుప్రభాత సేవ, ఆరాధన, ఆరగింపు, సేవాకాలం, నిత్యహోమాలు, నిత్యబలిహరణం తదితర నిత్యపూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారి నిత్యకల్యాణమూర్తులను బేడా మండపానికి తీసుకువచ్చి కల్యాణం నిర్వహించారు.

స్పెషల్ జడ్జిని కలిసిన న్యాయవాదులు

జడ్జికి పుష్పగుచ్ఛం ఇస్తున్న సీనియర్ న్యాయవాదులు

కొత్తగూడెం టౌన్, ఏప్రిల్ 29 : జిల్లా కోర్టులో ఇటీవల నియమితులైన స్పెషల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ మెండు రాజమల్లును సీనియర్ న్యాయవాదులు మంగళవారం సన్మానించారు.. పుష్పగుచ్ఛాలు అందించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో జీవీకే మనోహర్‌రావు, వెల్లంకి వెంకటేశ్వరరావు, రావి విజయకుమార్, ఊటుకూరు పురుషోత్తంరావు పాల్గొన్నారు.

ప్రముఖ వ్యాపారి కృష్ణారావు మృతి

బొమ్మిశెట్టి కృష్ణారావు

పాల్వంచ, ఏప్రిల్ 29 : పాల్వంచ పట్టణంలోని ప్రముఖ తిరుమల రైస్ అండ్ కిరాణా హోల్‌సేల్ అండ్ రిటైల్ వ్యాపారి బొమ్మిశెట్టి కృష్ణారావు(70) మంగళవారం మృతిచెందారు. పాల్వంచలోని గట్టాయిగూడెంలో ఆయన స్వగృహానికి వెళ్లి మృతదేహాన్ని సందర్శించి పట్టణ ప్రముఖులు నివాళులర్పించారు. కృష్ణారావు కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. కృష్ణారావు గత 45 సంవత్సరాలుగా పాల్వంచలో వ్యాపారం చేస్తున్నారు. పాల్వంచ చుట్టుపక్కల ప్రాంతాలకు చెందిన పలు చిల్లర వర్తకులు అంతా కూడా ఇక్కడే కొనుగోలు చేసి ఆయా గ్రామాల్లో అమ్ముతుంటారు. ఆయన మృతికి సంతాపంగా పాల్వంచ పట్టణంలోని వ్యాపార సంస్థలు బంద్ చేశారు.

ఉగ్రవాద దాడికి నిరసనగా కొవ్వొత్తుల ర్యాలీ

కొవ్వొత్తులతో ర్యాలీ చేస్తున్న యువత

దుమ్ముగూడెం, ఏప్రిల్ 29: మండల పరిధిలోని రేగుబల్లి గ్రామంలో అంబేద్కర్‌నగర్ కాలనీ యువత ఆధ్వర్యంలో కాశ్మీర్ పెహల్గాంలో జరిగిన ఉగ్రవాద దాడికి నిరసనగా మంగళవారం కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. ఉగ్రవాదుల కాల్పుల్లో మృతిచెందిన వారి ఆత్మకు శాంతి కలగాలని, ఉగ్రవాదం నశించాలని, ప్రపంచశాంతి వర్ధిల్లాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో దామెర్ల శ్రీనివాసరావు, రేగుబల్లి గ్రామ యువకులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

ఆదివాసీలకు విద్య వైద్యం కల్పించడమే లక్ష్యం

చిన్నారులకు దుస్తులు అందజేస్తున్న ఏఎస్పీ

చర్ల, ఏప్రిల్ 29: ఆదివాసీలకు విద్య, వైద్యం, రవాణా సౌకర్యాలు కల్పించడమే లక్ష్యమని భద్రాచలం ఏఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్ అన్నారు. ఛత్తీస్‌గఢ్ సరిహద్దు గ్రామం యర్రంపాడులో మంగళవారం ఏర్పాటు చేసిన కమ్యూనిటీ కనెక్ట్ ప్రోగ్రాంలో ఆయన మాట్లాడారు. పోలీసులు ప్రజలకు ఎప్పుడూ అండగా ఉంటారని, గ్రామంలోకి ఎవరైనా కొత్త వ్యక్తులు ప్రవేశిస్తే వెంటనే పోలీసులకు తెలియజేయాలని అన్నారు. ఈ సందర్భంగా ఆయన మహిళలకు చిన్నపిల్లలకు దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో చర్ల సీఐ రాజువర్మ, ఎస్సైలు కేశవ్, కార్తీక్, స్పెషల్‌పార్టీ సిబ్బంది పాల్గొన్నారు.

ఐటీడీఏ పీవోకు ఫిర్యాదు

అశ్వారావుపేట రూరల్, ఏప్రిల్ 29 : ఇందిరమ్మ గృహాల లబ్ధిదారులను గ్రామ పంచాయతీ గ్రామసభల ద్వార ఎంపిక చేయవలసి ఉండగా, సభలు నిర్వహించకుండా లిస్టులు తయారు చేశారని భద్రాచలం ఐటీడీఏ పీవో రాహుల్‌కు మండలంలోని రామన్నగూడెం, అనంతారం గ్రామ ఆదివాసీలు ఫిర్యాదులు చేశారు. సోమవారం భద్రాచలం ఐటీడీఏలో జరిగిన గిరిజన దర్బార్‌లో పీవోకు ఫిర్యాదు చేశారు. ఇందిరమ్మ కమిటీలు ఏకపక్షంగా గిరిజనేతరులకు ఇళ్లు మంజూరు చేశారని పేర్కొన్నారు. ఫిర్యాదు అందజేసిన వారిలో పీసా కమిటీ సభ్యులు నాగేశ్వరావు, సీతారాములు, కన్నంరాజు, భాస్కరావు, పలువురు ఆదివాసీలు ఉన్నారు.

సంక్షిప్తం

పత్తి కొనుగోళ్లపై విజిలెన్స్ విచారణ

అశ్వాపురం, ఏప్రిల్ 29: ఈ ఏడాది కాటన్ కార్పోరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ) ద్వారా ప్రభుత్వం చేపట్టిన పత్తి కొనుగోళ్ల వ్యవహారంలో మండల వ్యవసాయశాఖ ఏఈవో ఒకరు కాటన్ ట్రేడర్స్‌కి నకిలీ టీఆర్‌లు జారీ చేసిన విషయం పత్రికల్లో రావడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వ్యవసాయశాఖ ప్రత్యేక అధికారి గతంలోనే విచారణ చేపట్టి నివేదిక సమర్పించారు. ఆ నివేదిక ప్రకారం వరంగల్ విజిలెన్స్‌శాఖ అధికారులు మంగళవారం మండల పరిధిలోని రామచంద్రాపురం గ్రామంలో రైతులతో గోప్యంగా విచారణ జరిపారు.

తాగునీటి సరఫరాకు అంతరాయం

భద్రాచలం, ఏప్రిల్ 29: భద్రాచలం పట్టణంలో మిషన్ భగీరథ ద్వారా నీటిని సరఫరా చేసే ఇన్‌టేక్‌వెల్ పూడికతీత పనులు చేపట్టడంతో పట్టణంలో మే 1వ తేదీ నుంచి 7వ తేదీ వరకు ఉదయం నీటి సరఫరాకు అంతరాయం కలుగుతుందని మిషన్ భగీరథ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ నళిని మంగళవారం తెలిపారు. పూడికతీత పనులు యుద్ధప్రాతిపదికన జరుగుతున్న క్రమంలో ఉదయం సమయంలో మంచినీటి సరఫరా జరగదని, ప్రజలు తమకు సహకరించాలని, పూడికతీత పనులు పూర్తి చేసిన వెంటనే మంచినీటి సరఫరా పునరుద్ధరిస్తామని ఆమె తెలిపారు.

వ్యక్తికి జైలు, జరిమానా

భద్రాచలం, ఏప్రిల్ 29: అజాగ్రత్తగా, అతివేగంగా మోటారుసైకిల్‌తో ఢీకొట్టిన ఘటనలో ముద్దాయికి 16 నెలల జైలు శిక్ష విధిస్తూ భద్రాచలం ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ శివనాయక్ మంగళవారం తీర్పు చెప్పారు. కేసు పూర్వాపరాలు.. దుమ్ముగూడెం మండలం చిన్నవల్లబెల్లికి చెందిన ఎలగందుల భవానీ అక్టోబర్ 31 2014న సాయంత్రం తన భర్త పనిమీద చర్లపల్లి నుంచి వెళ్లి వస్తూ పక్కన ఆగడంతో ఎదురుగా అతివేగంగా ద్విచక్రవాహనంపై మహేష్ అనే వ్యక్తి వచ్చి ఢీకొట్టాడు. ఈ ఘటనలో భర్త మృతిచెందాడు. కేసు నమోదు చేసిన పోలీసులు కోర్టులో చార్జీషీటు వేయగా నిందితుడికి 16 నెలల జైలు, రూ.1000 జరిమాన విధిస్తూ మంగళవారం తీర్పునిచ్చారు.

గుండాల ఎంపీడీవో సరెండర్

గుండాల, ఏప్రిల్ 29: విధుల పట్ల నిర్లక్ష్యం వహించిన గుండాల ఎంపీడీవో సత్యనారాయణను మంగళవారం సరెండర్ చేశారు. ఇందిరమ్మ గృహాల మ్యాప్ నిర్వహణతో పాటు రాజీవ్ యువవికాసంలో నిర్లక్ష్యం, విడియో కాన్ఫరెన్స్‌లకు హాజరుకానందున అధికారులు ఎంపీడీవోను జిల్లా పరిషత్‌కు సరెండర్ చేశారు. ఆయన స్థానంలో టేకులపల్లి సూపరింటెండెంట్ శ్రీనివాసరావును అదనపు బాధ్యతలతో గుండాల ఎంపీడీవోగా నియమించారు.

పోడు భూములకు పట్టాలివ్వాలి

పాల్వంచ రూరల్, ఏప్రిల్ 29 : పేదల సాగులో ఉన్న పోడు భూములకు పట్టాలివ్వాలని వ్యవసాయ సంఘ కార్మిక నాయకుడు నిమ్మల రాంబాబు ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం ఉల్వనూరులో వ్యవసాయ కార్మిక సంఘ సమావేశం మండల అధ్యక్షుడు వేములపల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగింది.

కలప పట్టివేత

కరకగూడెం, ఏప్రిల్ 29: మండల పరిధిలోని తుమ్మలగూడెం గ్రామ సమీపంలో అక్రమంగా తరలిస్తున్న టేకు, కలపను అటవీశాఖ అధికారులు మంగళవారం పట్టుకున్నారు. అటవీశాఖ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. అనంతారం బీట్ పరిధిలోని ఎర్రారం అటవీ ప్రాంతంలో టేకు చెట్లను కొట్టి ట్రాక్టర్‌పై శనివారం సుమారు 15 టేకు దిమ్మెలు తరలిస్తుండగా సమాచారం మేరకు దాడులు చేసి అటవీ అధికారులు కలపను స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న కలపను ఏడూళ్లబయ్యారం రేంజ్ కార్యాలయానికి తరలించి విచారణ జరుపుతున్నట్లు రేంజర్ తేజస్వీని తెలిపారు.

నర్సరీలను పరిశీలించిన ఎంపీవో

అశ్వారావుపేట రూరల్, ఏప్రిల్ 29 : మండల పరిధిలోని వినాయకపురం, ఆసుపాక, నందిపాడు గ్రామాల్లోని గ్రామ పంచాయతీ కార్యాలయాల వద్ద ఏర్పాటు చేసిన నర్సరీలను ఎంపీవో సోయం ప్రసాద్ మంగళవారం పరిశీలించారు. ఎండల తీవ్రత అధికంగా ఉందని, మొక్కలకు నీరు సక్రంగా అందించాలని సూచించారు. తాగునీటి సమస్య లేకుండా జాగ్రత్తలు పాటించాలని కార్యదర్శులను ఆదేశించారు.

జామాయిల్ పెంపకంపై